# ప్రజావాణి అర్జీల పరిష్కారంపై దృష్టి పెట్టాలి

- కలెక్టర్ ప్రావీణ్య
- వివిధ సమస్యలపై 106 అర్జీలు

హనుమకొండ, ఏప్రిల్ 7 : ప్రజావాణి అర్జీల పరిష్కారంపై దృష్టి పెట్టాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్వో గణేశ్‌తో కలిసి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఆమె విజ్ఞప్తులు స్వీకరించారు. మొత్తం 106 అర్జీలు వచ్చాయి. వీటిలో అత్యధికంగా తహసీల్దార్ కార్యాలయాల్లో భూములకు సంబంధించి 30, జీడబ్ల్యూఎంసీ 12, ఎంపీడీవో ఆఫీసులకు సంబంధించి 12, హనుమకొండ ఆర్డీవో ఆఫీసువి 6, డబుల్ బెడ్‌రూం 6, పరకాల ఆర్డీవో 5, సివిల్ సప్లయ్ 4, విద్యాశాఖవి 4తో పాటు మిగిలినవి ఇతర శాఖలకు చెందినవి ఉన్నాయి. నగరంలోని 56వ డివిజన్ గాయత్రీ కాలనీకి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో వచ్చి తమ కాలనీకి మంచినీటి సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం బోర్ నీళ్లతో జీవిస్తున్నామని, అవి కూడా సరిగ్గా రావడం లేదని, ప్రతి రోజు నీటి ట్యాంకర్ పంపించాలని, అలాగే శాశ్వతంగా నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. జలాశయాలు, గ్రామాల్లో చెరువులు, కుంటలు, బావుల వద్ద హెచ్చరిక బోర్డులు పెట్టి రక్షణ చర్యలు తీసుకోవాలని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు కలెక్టర్‌కు విన్నవించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, ఆర్డీవోలు రాథోడ్ రమేశ్, నారాయణ, తహసీల్దార్లు బావుసింగ్, శ్రీపాల్‌రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు. అలాగే మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన పోషణ పక్షం వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఏప్రిల్ 8 నుంచి 22వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా పోషణ పక్షం నిర్వహిచనున్నారు. జిల్లా సంక్షేమ అధికారి జయంతి పాల్గొన్నారు. ప్రపంచ ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన వేసవిలో జాగ్రత్తలు, కృత్రిమ రసాయన శీతల పానీయాలు నివారించాలి అనే కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. రాష్ట్ర జేవీవీ ఉపాధ్యక్షుడు ఆచార్య లక్ష్మిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు కాజీపేట పురుషోత్తం, ఉపాధ్యక్షుడు డీఆర్ రాములు, ఉమా మహేశ్వర్‌రావు, కోశాధికారి పరికిపండ్ల వేణు, కార్యవర్గ సభ్యుడు వకుళాభరణం శ్రీనివాస్ పాల్గొన్నారు. జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు, 2 బీహెచ్‌కే ఇళ్ల పురోగతిపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇండ్ల నిర్మాణానికి కావాల్సిన ఇసుక కూపన్లు అధికారులు అందజేయాలన్నారు. బేస్‌మెంట్ వరకు వచ్చిన వాటికి బిల్లుల చెల్లించాలన్నారు. యూడీఐడీ కార్డులు, చేయూత పెన్షన్లపై అధికారులతో చర్చించారు. జిల్లా హౌసింగ్ అధికారి రవీందర్, అడిషనల్ డీఆర్డీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు. అన్ని మండలాల పరిధిలో ఏర్పాటు చేసిన 150 ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారం రోజుల్లోగా ప్రారంభించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కొమరయ్య, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్ ఉన్నారు.


పలు అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

**పెంచి పెద్ద చేస్తే.. కాదంటున్నాడు**

**– పైండ్ల రాజమ్మ, పెద్దకోడెపాక, శాయంపేట**

నా మనుమడిని పెంచి పెద్ద చేస్తే ఇపుడు కాదంటున్నాడని.. సాకకుండా ఇబ్బందులు పెడుతున్నాడని శాయంపేట మండలం పెద్ద కోడెపాకకు చెందిన పైండ్ల రాజమ్మ (80) కలెక్టరేట్‌కు వచ్చి కన్నీటి పర్యంతమైంది. పూర్తి వివరాలు ఆమె మాటల్లో.. నాకు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు. అందరికీ పెళ్లిళ్లు అయ్యాయి. నా భర్త పేరుపై ఉన్న 32గుంటల నుంచి 12 గుంటల భూమిని నా కుమారుడు వెంకటయ్యకు ఇవ్వగా అమ్ముకున్నాడు. అనారోగ్య కారణాలతో నా కొడుకు, కోడలు మృతిచెందారు. అప్పుడు నా మనుమడు రాజు వయస్సు 9నెలలు. అప్పటి నుంచి రజక వృత్తితో పాటు కూలినాలి చేసుకుంటూ మనుమడిని సాకి పెద్ద చేసి పెండ్లి చేశాను. అతడికి ఇద్దరు సంతానం. నా భర్త పేరుపై మిగిలి ఉన్న 20గంటల భూమిని మా ప్రమేయం లేకుండా పట్టా చేయించుకొని ఇబ్బందులు పెడుతున్నాడు. ఆ భూమిని తిరిగి నా పేరుపై చేసి న్యాయం చేయాలి.


బిడ్డలతో కలెక్టరేట్‌కు వచ్చిన పైండ్ల రాజమ్మ

**నా భూమిని కాపాడండి..**

కబ్జాదారుల నుంచి నా భూమిని రక్షించాలని న్యాయవాది సాయిని నరేందర్ సోమవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. వడ్డేపల్లి శివారులోని జవహర్ కాలనీలోని సర్వే నంబర్ 27లో 2010లో 2,310 చదరపు గజాల ఇంటి స్థలం కొనుగోలు చేశాం. కొందరు మూడు సంవత్సరాల క్రితం నా భూమిలో కొంతమేర ఆక్రమించి ఇంటి నిర్మాణానికి అనుమతి తీసుకున్నారు. విచారణ జరిపి నా భూమిని రక్షించాలని నరేందర్ వినతిపత్రంలో పేర్కొన్నారు.

**బదిలీ నిర్ణయం వెనక్కి తీసుకోవాలి..**

పంచాయతీ కార్యదర్శుల బదిలీ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ కోరారు. టీఎన్జీవోస్, పంచాయతీ కార్యదర్శులతో కలిసి కలెక్టర్‌ను కలిసి బదిలీ నిర్ణయం విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఒక్క ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే కార్యదర్శులను బదిలీ చేయడం సరి కాదన్నారు. జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేశ్ పాల్గొన్నారు.

**మా భూముల్లో సాగు చేసుకోనివ్వాలి..**

అటవీ శాఖ అధికారులపై చర్యలు తీసుకొని మా భూముల్లో సాగు చేసుకొనే అవకాశం కల్పించాలని ముప్పారం గ్రామ రైతులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామ శివారులోని 204, 842, 844, 845, 846, 847 సర్వే నంబర్లలోని వ్యవసాయ భూములకు తగిన నష్టపరిహారం ఇవ్వకుండా ఆక్రమించి, మమ్ములను సేద్యం చేసుకోకుండా అడ్డుకొని అక్రమంగా కేసులు పెట్టారన్నారు. ఫారెస్ట్ అధికారుల బాధలు భరించలేక కలెక్టర్‌ను కలిశామన్నారు.

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి**



హనుమకొండ, ఏప్రిల్ 7 : వాతావరణ శాఖ భారీ వర్షాలు, ఈదురుగాలుల హెచ్చరిక నేపథ్యంలో గోదావరి పరివాహక ప్రాంతాలైన భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం పరిధిలో అప్రమత్తంగా ఉండాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశించారు. ఎక్కడైనా చెట్లు విరిగి, లైన్‌లు తెగిపడి ట్రిప్పింగ్స్, బ్రేక్ డౌన్స్ సంభవిస్తే త్వరగా పునరుద్ధరణ చర్యలు చేపట్టాలన్నారు. నక్కలగుట్టలోని విద్యుత్ భవన్ ఆఫీసు నుంచి సోమవారం 12 సర్కిళ్ల ఎస్‌ఈలు, డీఈలు, ఏడీఈలు, ఏఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయానికి అవసరం ఉన్నచోట 63 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్నారు. సిబ్బంది భద్రతకు ఎల్సీ యాప్‌ను రూపొందించామన్నారు. ఇన్‌చార్జి డైరెక్టర్లు సదర్‌లాల్, డీఈ జమున పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ, ఏప్రిల్ 7 : హనుమకొండ టౌన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆపరేషన్స్ డీఈ సాంబారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌ఈసీ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8.30 నుంచి 10.30గంటల వరకు టీచర్స్‌కాలనీ, బ్యాంకు కాలనీ, చైతన్యపురి కాలనీ ఏరియాల్లో, వడ్డేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి 10గంటల వరకు వడ్డేపల్లి చర్చి, బాలయ్య హోటల్ ఏరియా, రాఘవేంద్ర నగర్, స్నేహనగర్, భవానీ నగర్, సూర్య ఆస్పత్రి ఏరియా, గోపాల్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి 11గంటల వరకు గోపాల్‌పూర్, బ్యాంక్ కాలనీ, ఎల్‌ఐసీ కాలనీ, కనకదుర్గ కాలనీ, సుభాశ్ రోడ్డు, ఎన్జీవోస్ కాలనీ, వెంకటేశ్వరకాలనీ, సిగ్మా కాలేజీ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

## కాజీపేట రైల్వే క్రూ ల్యాబీ ఎదుట నిరసన

కాజీపేట, ఏప్రిల్ 7 : లోకో రన్నింగ్ స్టాఫ్ కార్మికులకు వ్యతిరేకంగా మల్టీ డిసిప్లినరీ కమిటీ రైల్వే బోర్డుకు ఈ నెల 4న నివేదిక సమర్పించినందుకు కాజీపేట రైల్వే క్రూ ల్యాబీ ఎదుట సోమవారం రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో లోకో రన్నింగ్ స్టాఫ్ కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కాజీపేటలో క్రూ డిపోలో రైల్వే అధికారులు తగ్గించిన శాంక్షన్ పోస్టులను పెంచాలన్నారు. కాజీపేటకు రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్లు, లోకో ఇంజిన్‌లోని కెమెరాలను తీసి వేయాలని డిమాండ్ చేశారు. పుష్‌పుల్ రైలుకు అసిస్టెంట్ డ్రైవర్‌ను కేటాయించాలన్నారు. నాయకులు సాయికుమార్, కుమారస్వామి, ప్రవీణ్, ధనరాజ్, అహ్మద్, శ్రీనివాస్, ప్రసాద్, భరత్, లోకేశ్ పాల్గొన్నారు.

## సేంద్రియ వ్యవసాయ విధానమే మేలు

ఆత్మకూరు, ఏప్రిల్ 7 : మండలంలోని నాగయ్యపల్లి గ్రామంలో ఒడిశా రాష్ట్రానికి చెందిన సెంచూరియన్ విశ్వవిద్యాలయ విద్యార్థులు క్షేత్ర స్థాయి పర్యటన చేశారు. రెండు రోజుల నుంచి విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు అశోక్, హర్షవర్ధన్‌ల పర్యవేక్షణలో విద్యార్థులు మెండె అంజలి, మెండె ప్రీతి, మందగిరి వరలక్ష్మి పంటలను పరిశీలించారు. రైతులకు సేంద్రియ వ్యవసాయ విధానంపై అవగాహన కల్పించారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించొచ్చన్నారు.


రైతుకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

## లొంగిపోయిన మహిళా మావోయిస్టుకు రివార్డు

సుబేదారి, ఏప్రిల్ 7 : ఫిబ్రవరిలో పోలీసులకు లొంగిపోయిన మావోయిస్ట్ ఏరియా కమిటీ సభ్యురాలు వంజం జెన్నీకి వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ సోమవారం హనుమకొండలోని సీపీ కార్యాలయంలో రూ.4లక్షల రివార్డు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడారు. మావోయిస్టులు హింసను వదిలి జనంలోకి రావాలని, లొంగిపోయిన మావోయిస్టులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, ఏసీపీ జితేందర్‌రెడ్డి, తిరుమల్, కాజీపేట ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

**14మంది మద్యం బాబులకు జైలు..**

మద్యం తాగి వాహనాలు నడిపిన 95మందిలో 14మందికి కోర్టు రెండు రోజుల జైలు శిక్ష విధించిందని ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ తెలిపారు.

## పద్మశాలి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన

హసన్‌పర్తి, ఏప్రిల్ 7 : పద్మశాలి కమ్యూనిటీ హాల్‌ను హైటెక్ హంగులతో నిర్మిస్తామని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మేయర్ గుండు సుధారాణి అన్నారు. చింతగట్టు క్యాంపు ఒకటో డివిజన్ పరిధిలోని ఎస్సారెస్పీ వద్ద బల్దియా సాధారణ నిధులు రూ.కోటితో పద్మశాలి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి సోమవారం వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పద్మశాలీల అభివృద్ధికి గత ప్రభుత్వం కమ్యూనిటీ హాల్ కోసం స్థలం కేటాయించిందని, ఆ స్థలంలో బల్దియా నిధులతో కమ్యూనిటీ హాల్ నిర్మిస్తున్నామని తెలిపారు. అఖిల భారత పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడు గుండు ప్రభాకర్, కార్పొరేటర్ అరుణాకుమారి, ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ నరేందర్, జిల్లా అధ్యక్షుడు ఆడెపు రవీందర్, సంఘం అధ్యక్షుడు భాస్కర్, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, మాజీ అధ్యక్షుడు కేశవమూర్తి, సదానందం, నాయకులు భిక్షపతి, రాకేశ్, సంతోష్ పాల్గొన్నారు.

## మడికొండలో ఉద్రిక్తత

**డంపింగ్ యార్డు నిర్మూలన కమిటీ సభ్యుల అరెస్టు**

మడికొండ, ఏప్రిల్ 7 : హనుమకొండ జిల్లా మడికొండ శివారులోని డంపింగ్ యార్డుకు నగరం నుంచి వచ్చే చెత్త తరలింపు వాహనాలను అడ్డుకునేందుకు 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికారెడ్డి ఆధ్వర్యంలో డంపింగ్‌యార్డు నిర్మూలన కమిటీ సభ్యులు ప్రధాన రహదారిపైకి చేరుకున్నారు. నగరంలో పోలీస్ యాక్టు అమలులో ఉన్నందున వీరిని అడ్డుకునేందుకు ఉదయాన్నే సుమారు యాభై మంది పోలీసులు చౌరస్తాకు చేరుకున్నారు. ఒక్కసారిగా కమిటీ సభ్యులు రహదారిపైకి చేరుకోగానే హుటాహుటిన అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అనంతరం రాధికారెడ్డి మాట్లాడుతూ ప్రజల తరపు న పోరాటం చేస్తుంటే అక్రమంగా పోలీసులు అరెస్టు చేశారన్నారు. ప్రజలను ఇబ్బందులను గురి చేస్తున్న డంపింగ్ యార్డును వెంటనే తరలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గడ్డం మహేందర్, పల్లపు యాదగిరి, పల్లపు నర్సింగరావు, బుర్ర రాజ్‌కుమార్, తండా శంకర్, ఆవాల నరోత్తంరెడ్డి, బరిగెల కృష్ణమూర్తి పాల్గొన్నారు.


రహదారిపైకి వస్తున్న కమిటీ సభ్యులు

## 'వ్యాగన్ పరిశ్రమ' బాధితులకు పరిహారం ఇప్పించాలి

మడికొండ, ఏప్రిల్ 7 : అయోధ్యపురం గ్రామ శివాలో రైల్వే వ్యాగన్ పరిశ్రమ కోసం భూమిని కోల్పోయిన రైతులకు పరిహారం ఇప్పించాలని కోరుతూ ఎంపీ కడియం కావ్యను సోమవారం బాధితులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. రైల్వే వ్యాగన్ ప్రాజెక్ట్ కోసం రైతుల నుంచి 9.03 ఎకరాలు ప్రభుత్వం సేకరించిందని చెప్పారు. భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది కానీ పరిహారం మొత్తం చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరగా నష్టపరిహారం మొత్తాన్ని చెల్లించేలా చొరవ తీసుకోవాలని కోరారు. భూములు కోల్పోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని వేడుకున్నారు.

## ఒంటిమామిడిపల్లి పాఠశాలను ఆదర్శంగా తీసుకోవాలి

ఐనవోలు, ఏప్రిల్ 7 : ఒంటిమామిడిపల్లి పాఠశాలను ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. మండలంలోని ఒంటిమామిడిపల్లి జడ్పీ పాఠశాలను రంగారెడ్డి జిల్లా మంచాల్ మండలంలోని ఆరుట్ల స్కూల్ డెవలప్‌మెంట్ అండ్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులతో కలిసి ఆయన సందర్శించారు. పాఠశాల తరగతి గదులు, ల్యాబ్, లైబ్రరీ, కంప్యూటర్ క్లాస్ రూంలను పరిశీలించారు. అనంతరం పేరెంట్స్ కమిటి సభ్యులు గెజిటెడ్ హెచ్‌ఎం, పీఈటీ, క్రాఫ్ట్ టీచర్లు, అదనపు తరగతి గదులు కేటాయించాలని కోరుతూ మురళికి వినతిపత్రం అందజేశారు. ఎస్‌ఎంసీ మాజీ చైర్మన్ పొన్నాల రాజు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పెండ్లి నవీన్, బాలవికాస ప్రతినిధి తిరుపతిరెడ్డి, హెచ్‌ఎం సదానందం, ఎంఈవో ఆనందం, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ సకినాబీ, పేరెంట్స్ కమిటీ వైస్ చైర్మన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి

**ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి**

హనుమకొండ చౌరస్తా/నయీంనగర్ : అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వామ్యులు కావాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. 5వ డివిజన్ పరిధిలోని కొత్తూర్ బ్రిడ్జి చేపల మార్కెట్ వద్ద రూ.25 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మేయర్ గుండు సుధారాణి, వరంగల్ మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, కార్పొరేటర్ పోతుల శ్రీమాన్‌తో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. డివిజన్ అధ్యక్షురాలు గాండ్ల స్రవంతి, కొడిపాక గణేశ్, సురేశ్‌బాబు, ముప్పిడి శ్రవణ్ పాల్గొన్నారు. 57వ డివిజన్‌లోని సమ్మయ్యనగర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే, మేయర్, మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు. సీసీ రోడ్డు, డ్రెయిన్లు, మహిళా కమ్యూనిటీ హాల్, 100 ఫీట్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్, రిటెయింగ్ వాల్, కుడా కాలనీ బ్రిడ్జి అభివృద్ధి పనులపై చర్చించారు.

**అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి..**

హనుమకొండ : పశ్చిమ నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే నాయిని అన్నారు. కలెక్టరేట్‌లో నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి పనులపై మేయర్, కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య, కుడా వైస్ చైర్మన్‌తో కలిసి సమీక్షించారు. భద్రకాళీ చెరువు పూడికతీత పనులను వర్షాకాలం కంటే ముందే పూర్తి చేయాలన్నారు. భద్రకాళీ ఆలయ మాడవీధులు, జేఎన్ఎస్‌లో ఇండోర్ స్టేడియం, జిమ్నాస్టిక్స్, స్విమ్మింగ్‌పూల్ పునరుద్ధరణ పనులు వారంలో ప్రారంభించి నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, కుడా పీవో అజిత్‌రెడ్డి, ఈఈ భీమ్‌రావు, ఇరిగేషన్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఆర్డీవో రాథోడ్ రమేశ్ పాల్గొన్నారు.

## జిల్లా స్థాయిలో రాణించిన గురుకుల విద్యార్థి

మడికొండ, ఏప్రిల్ 7 : విద్యార్థుల్లో సృజనాత్మక ప్రతిభను వెలికి తీయడానికి నిర్వహించిన రాష్ట్రీయ ఆవిష్కార్ అభియాన్ పోటీ పరీక్షలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల 7వ తరగతి విద్యార్థి ఆశిష్ మండలంలో ప్రథమ స్థానంలో, జిల్లా స్థాయిలో 3వ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ బత్తుల కుమారస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆశిష్‌కు సర్టిఫికెట్‌తో పాటు మెమెంటోను బహూకరించి అభినందించారు. విద్యార్థి ప్రతిభకు కారణమైన వెంకన్నను ప్రత్యేకంగా అభినందించారు.

## 9 నుంచి దూరవిద్య బీఎస్సీ ప్రాక్టికల్ తరగతులు

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 7 : కాకతీయ విశ్వవిద్యాలయం దూరవిద్యా కేంద్రం అందిస్తున్న డిగ్రీ బీఎస్సీ కోర్సుల మొదటి సంవత్సరం(సెమిస్టర్–1) 2023–24 విద్యార్థుల ప్రాక్టికల్ తరగతులు 9, 10, 11న దూరవిద్యా కేంద్రంలో జరుగుతాయని సంచాలకుడు సురేశ్‌లాల్, సహాయ సంచాలకుడు బట్టి వెంకటగోపీనాథ్ తెలిపారు. విద్యార్థులంతా ఉదయం 10 గంటలకు ప్రాక్టికల్ తరగతులకు హాజరు కావాలన్నారు. ఈ తరగతులు కాగానే ఏప్రిల్ 12, 13 తేదీల్లో కంప్యూటర్ సైన్స్, గణితం, స్టాటిస్టిక్స్ ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయని వివరించారు. ఈ అవకాశం వినియోగించుకొని విద్యార్థులు తరగతులకు హాజరై ప్రాక్టికల్ పరీక్షలు తప్పనిసరిగా రాయాలన్నారు.


## రజతోత్సవ మహాసభను అడ్డుకొనేందుకే సిటీ పోలీస్ యాక్టు

భీమదేవరపల్లి, ఏప్రిల్ 7 : ఎల్కతుర్తిలో ఈ నెల 27వ తేదీన జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభను అడ్డుకునేందుకే ప్రభుత్వం సిటీ పోలీస్ యాక్టును నెల రోజుల పాటు అమలు చేస్తున్నదని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మండల సురేందర్ విమర్శించారు. మండలంలోని ముల్కనూరులో సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులపై కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నాడని మండిపడ్డారు. మ్యానిఫెస్టోలోని ఆరు గ్యారెంటీలు అమలు చేయలేక, అడిగిన వాళ్లపై తన అక్కసుకు వెళ్లగక్కుతున్నాడని విమర్శించారు. ప్రతిపక్ష నాయకులు, బీఆర్ఎస్ కార్యకర్తలపై కేసులు పెడుతూ పోలీసు వ్యవస్థను తన సొంత ఎజెండాకు వాడుకుంటున్నాడని ఆరోపించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ఉద్యమకారులని, కేసులకు భయపడరని తెలిపారు. బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ జరగకుండా సీఎం వేస్తున్న కుటిల ఎత్తుగడలను తిప్పికొడతామని హెచ్చరించారు. సిటీ పోలీసు యాక్టును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.


బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సురేందర్

## ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో మాలధారణ

హనుమకొండ, ఏప్రిల్ 7 : హనుమకొండ పద్మాక్షికాలనీలోని హనుమత్‌గిరి ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో దుర్గాప్రసాద్ స్వామీజీ సోమవారం హనుమాన్ మాలధారణ ప్రారంభించారు. వందమందికి మాలధారణ చేశారు. అనంతరం బాలసముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో నూతన భవనాన్ని ప్రారంభించారు. పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హనుమాన్ దీక్ష సేవా సమితి హనుమకొండ విభాగం అధ్యక్షుడు గందె కృష్ణ, కర్రు దశరథ్‌కుమార్, మాదాసు మొగిలయ్య, కనుకుంట్ల రవికుమార్, నన్నబోయిన కొమురయ్య, కట్ల లక్ష్మిరెడ్డి, అంబటి నరేందర్ పాల్గొన్నారు.


మండల మాలధారణ చేస్తున్న దుర్గాప్రసాద్ స్వామీ

## టెక్నికల్ టీచర్ సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులు

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 7 : రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే టెక్నికల్ టీచర్ సర్టిఫికెట్ వేసవి శిక్షణ కోర్సులకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు డీఈవో వాసంతి తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 17 నుంచి 29వ తేదీ వరకు స్వీకరిస్తామని, దరఖాస్తు చేసేవారు 17 నాటికి 18 సంవత్సరాలు నిండి 45 ఏళ్లలోపు ఉండాలన్నారు. టెన్త్ పరీక్ష ఉత్తీర్ణులవ్వాలని, సంబంధిత టెక్నికల్ టీచర్ సర్టిఫికెట్ కోర్సులో లోయర్ గ్రేడ్ ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. దరఖాస్తులను డీఈవో కార్యాలయంలో సమర్పించాలని, ఇతర వివరాలకు www.bse.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడాలని, మే 1 నుంచి జూన్ 6 వరకు (42 రోజులు) శిక్షణ తరగతులు నిర్వహిస్తామని తెలిపారు.

## రేపు వాహనాల వేలం

పరకాల, ఏప్రిల్ 7 : పరకాల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పరిధిలో పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను బుధవారం ఉదయం 11గంటలకు వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ తాతాజీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్‌లో వేలం నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు వాహనం అప్‌సెట్ ప్రైస్‌పై 50శాతం డిపాజిట్‌గా చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

## నాన్ బెయిలబుల్ వారెంట్‌లో ఒకరి అరెస్ట్

శాయంపేట, ఏప్రిల్ 7 : కోర్టుకు హాజరు కాకపోవడంతో నాన్ బెయిలబుల్ వారెంట్‌లో ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్సై జక్కుల పరమేశ్ సోమవారం తెలిపారు. మండలంలోని గోవిందాపూర్‌కు చెందిన మాందాటి తిరుపతి వ్యవసాయం చేసుకుంటున్నాడు. అతడు క్రిమినల్ కేసులో నాన్ బెయిలబుల్ వారెంటు. కోర్టుకు హాజరు కాకపోవడంతో అరెస్టు చేసి పరకాల కోర్టులో హాజరుపర్చగా, మెజిస్ట్రేట్ శాలిని తిరుపతికి తొమ్మిది రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

## యువత అంబేద్కర్ జీవిత చరిత్ర చదవాలి

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 7: ప్రపంచ మేధావి బాబా సాహెబ్ అంబేద్కర్ జీవిత చరిత్ర చదవాల్సిన బాధ్యత యువతపై ఉన్నదని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్ అన్నారు. కేయూ సెనేట్ హాల్‌లో బహుజన మహనీయుల సభ నిర్వహించారు. ఇఫ్లూ యూనివర్సిటీ స్టూడెంట్ యూనియన్ అధ్యక్షుడు వికాస్, బీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడుప్రశాంత్, ఉపాధ్యక్షుడు శ్రీహిత ఉన్నారు.

## శాయంపేటలో గాలివాన బీభత్సం

శాయంపేట, ఏప్రిల్ 7 : మండలంలో సోమవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. దుమ్ము, ధూళి లేచి జనం ఇబ్బందులు పడ్డారు. పలు చోట్ల ఇళ్ల రేకులు ఎగిరిపోయాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పలు గ్రామాల్లో రైతులు జొన్నలు ఆరబోయగా, గాలిదుమారం రావడంతో కాపాడుకునేందుకు ఇబ్బందులు పడ్డారు. గాలులతో పలు చోట్ల వరి నేలవాలినట్లు రైతులు తెలిపారు.

# గ్రీవెన్స్ వినతులను తక్షణమే పరిష్కరించాలి

- గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్, ఏప్రిల్ 7 : గ్రీవెన్స్‌లో ప్రజలు ఇచ్చిన వినతులను తక్షణమే పరిష్కరించాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. హనుమకొండ రాజాజీ నగర్ నుంచి డబ్బాల వరకు స్మార్ట్‌సిటీ నిధులతో చేపట్టిన రోడ్డు నిర్మాణంలో అనేక అవకతవకలు జరిగాయని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. కొంత మంది ఇళ్లను కూల్చివేశారని, మరి కొంతమంది ఇళ్లను వదిలేశారని, క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. విశ్వకర్మ వీధిలో నిర్మిస్తున్న విశ్వకర్మ వసతి భవనం ఎదుట ర్యాంపును రోడ్డు వరకు నిర్మించారని, దీంతో ఇబ్బందులు కలుగుతున్నాయని కాలనీ వాసి తిప్పని బాబురావు ఫిర్యాదు చేశారు. న్యూ బృందావన్ కాలనీలో డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో మురుగు నీరు రోడ్డుపై నిలుస్తున్నదని, అధికారులు వెంటనే డ్రైనేజీ నిర్మించాలని కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. 31వ డివిజన్ న్యూ శాయంపేటలో తాగునీటి పైప్‌లైన్ లేక ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే పైప్‌లైన్ వేయాలని కాలనీవాసులు కోరారు. అనంతరం కమిషనర్ అధికారులతో మాట్లాడుతూ.. గ్రీవెన్స్ వినతులను జాప్యం లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ గ్రీవెన్స్‌లో మొత్తం 120 వినతులు వచ్చాయి. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 62, ఇంజినీరింగ్ విభాగం 32, ప్రజారోగ్య విభాగం 3, పన్నుల విభాగం 17, తాగునీటి సరఫరా 6 వినతులు వచ్చాయి. ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, డీఎఫ్‌వో శంకరలింగం, ఇన్‌చార్జి సిటీప్లానర్ రవీందర్ రాడేకర్, హెచ్‌వో రమేశ్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, రాజేశ్వర్ పాల్గొన్నారు.


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న బల్దియా కమిషనర్

**బల్దియా జేఏసీ డైరీ ఆవిష్కరణ..**

సమగ్ర సమాచారంతో డైరీ రూపొందించడం అభినందనీయమని మేయర్ గుండు సుధారాణి అన్నారు. కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో బల్దియా జేఏసీ నూతన డైరీ, క్యాలెండర్‌ను కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి ఆమె ఆవిష్కరించారు. జేఏసీ అధ్యక్షుడు బొట్ల రమేశ్, గౌరవాధ్యక్షుడు ధర్మరాజు, ప్రధాన కార్యదర్శి బాకం సంతోష్‌కుమార్, కోశాధికారి సజ్జన్‌రాజ్, ప్రతినిధులు రాజారపు భాస్కర్, బాలునాయక్, ఆనంద్, ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, డీఎఫ్‌వో శంకరలింగం, కార్యదర్శి అలివేలు, ఇన్‌చార్జి సిటీప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, రాజేశ్వర్, హెచ్‌వో రమేశ్ పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే**

కాజీపేట, ఏప్రిల్ 7 : ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే సూచించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం దర్గా బస్తీ దవాఖాన నేతృత్వంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్తీ దవాఖానలో డీఎంహెచ్‌వో అప్పయ్య అధ్యక్షతన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తే మాతాశిశు మరణాలను నివారించొచ్చన్నారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ ఏడాది మాతా శిశు మరణాలను తగ్గించేందుకు కృషి చేయాలని సూచించిందన్నారు. ప్రతి వెయ్యి జననాలకు ఇంకా 21 మంది శిశువులు, ప్రతి లక్షలో 43 మంది బాలింతలు వివిధ కారణాలతో మరణిస్తున్నారని, అందరం కలిసికట్టుగా పని చేసి మరణాలను నివారించాలని పేర్కొన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయ్‌కుమార్, ప్రోగ్రాం అధికారులు హిమ బిందు, ఇప్తికార్ అహ్మద్, మంజుల, వైద్యాధికారులు సృజన, వివేక్, జిల్లా మాస్ మీడియా అధికారి అశోక్‌రెడ్డి, గణాంక అధికారి ప్రసన్న కుమార్, హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఎంఎల్‌హెచ్‌పీ అభ్యర్థులకు కౌన్సెలింగ్ పూర్తి

నయీంనగర్, ఏప్రిల్ 7 : జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో 13 ఎంఎల్‌హెచ్‌పీ (మిడ్ లెవల్ హెల్త్ కేర్ ప్రొవైడర్) పోస్టులకు సోమవారం హనుమకొండలోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించినట్లు డీఎంహెచ్‌వో అప్పయ్య తెలిపారు. 11మంది హాజరయ్యారని, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థి రాలేదని, ఎంహెచ్ వికలాంగుల కోటాకు సంబంధించి అర్హులైన అభ్యర్థులు లేనందున మరో పోస్టు ఖాళీగా ఉంచినట్లు తెలిపారు. సోషల్ వెల్ఫేర్ డీడీ శ్రీలత, జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి గౌత మ్ చౌహాన్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి రాజేశ్, సూపరింటెండెంట్ వేణుగోపాల్, ఫాతిమా పాల్గొన్నారు.

## ఆరేళ్ల లోపు పిల్లలకు కంటి పరీక్షలు చేయించాలి

హసన్‌పర్తి, ఏప్రిల్ 7 : ఆరేళ్లలోపు ఉన్న పిల్లలకు కంటి పరీక్షలు చేయించాలని డీఎంహెచ్‌వో అప్పయ్య అన్నారు. ఎల్లాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో కంటి పరీక్ష శిబిరం సోమవారం నిర్వహించారు. డీఎంహెచ్‌వో, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి జయంతి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి మహేందర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటి పరీక్షలు నిర్వహిండం వల్ల చిన్న తనంలోనే సమస్యలు గుర్తించి తగిన చికిత్స చేయొచ్చన్నారు. వైద్యులు కుమారస్వామి, దుర్గాప్రసాద్, దివ్య పాల్గొన్నాను.

## కన్జ్యూమర్ ఫోరాన్ని సంప్రదించాలి

హసన్‌పర్తి, ఏప్రిల్ 7 : వినియోగదారులు విద్యుత్ సమస్యలు పరిష్కరించుకోవడానికి కన్జ్యూమర్ ఫోరాన్ని సంప్రదించాలని చైర్మన్ వేణుగోపాలచారి అన్నారు. హసన్‌పర్తి సబ్ డివిజన్ పరిధిలోని చింతగట్టు రూరల్ సెక్షన్ ఆఫీస్, నాగారం సబ్‌స్టేషన్ ఆవరణలో సోమవారం విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు ఏర్పాటు చేశారు. జిల్లా సూపరింటెండెంట్ మధుసూదనాచారి హాజరయ్యారు. ఏడీఈ అశోక్, రమేశ్, చరణ్, రామారావు, డీఈ సాంబారెడ్డి, ఏఈ శిరీశ్‌కుమార్, ఏఈ సత్యనారాయణ, పాల్గొన్నారు.

## ఐటీఐ పరీక్షలకు నోటిఫికేషన్ విడుదల

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 7 : ఐటీఐ పరీక్షలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు హనుమకొండ ఐటీఐ ప్రిన్సిపాల్ చందర్ తెలిపారు. సంబంధిత ట్రేడ్‌లో అభ్యర్థులకు 3 సంవత్సరాల పైబడి సర్వీస్, నైపుణ్యం సర్టిఫికెట్ ఉంటే ఎంప్లాయి గుర్తింపు కార్డు సమర్పించి వరంగల్ ములుగు రోడ్ ప్రాంతీయ ఉప సంచాలకులు (అప్రెంటిస్‌షిప్), ప్రాంతీయ కార్యాలయంలో రూ.100 చెల్లించి దారఖాస్తు పొందాలని కోరారు. దరఖాస్తులు 12వ తేదీలోగా అందజేయాలని, పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED




★ ప్రముఖ ఆయుర్వేద క్లినిక్‌లో రిసెప్షనిస్ట్ మరియు అసిస్టెంట్‌గా చేయుటకు డిగ్రీ పూర్తి చేసిన యువతి కావలెను. వెంటనే సంప్ర: సెల్: 8520902105.
NTW-000

PLOT FOR SALE



★వరంగల్ హైవే రఘునాథ్‌పల్లికి దగ్గరలో 2 లక్షలకే 121 Sq.yds. Plots అన్ని డెవలప్‌మెంట్స్‌తో కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్. ఫోన్: 8523041059.
NT-329891

LOSS OF DOCUMENT

★I, BEERAM BHARGAVI aliyas KALYANI, W/o BEERAM VENKAT REDDY. H.No. 2-10-405, Road No. 3D, Teachers Colony Phase-II, Hanumakonda, TG. have lost my Original Link Doument No. 280/1995, Plot No. 23, Extent of 288.88 sq.yds. Situated at Bheemaram, Hasanparthy, Hanumakonda. While travelling from KUC to Bheemaram by Auto On 03-04-2025 if anybody found Please Call Me: 9950258493.
NTW-6581

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563
WARANAGAL 9182777556

JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565